

ఉద్యోగుల అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

డిఆర్‌ఒ శివన్నారాయణరెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగుల అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని ఉద్యోగుల నుంచి 14 అర్జీలను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జిల్లా కలెక్టరేట్ ఎఒ వైకెపి.అప్పారావు పాల్గొన్నారు.



ఉద్యోగుల సమస్యలు వింటున్న డిఆర్‌ఒ

'కొల్లేరు'పై.. కపట నాటకం..!

- అక్కడి ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం
- ఉపాధి, అభివృద్ధి లేక విలవిల
- తాజాగా ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో దండయాత్ర
- ప్రజలు, ప్రజాప్రతినిధులు వ్యతిరేకిస్తున్నా ముందుకు
- కొల్లేరు ప్రజలను ఏమార్చేందుకు మాయమాటలు వల్లింపు

కొల్లేరు ప్రజలను పాలకులు తీవ్రంగా వంచిస్తున్నారు. అక్కడి ప్రజలకు అందించాల్సిన ఉపాధి, అభివృద్ధిని గాలికొదిలేసి ఎకోసెన్సిటివ్ జోన్ తెరపైకి తెచ్చి మరో విధ్వంసానికి పూనుకున్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు వ్యతిరేకిస్తున్నా తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా చాప కింద నీరులా ఎకోసెన్సిటివ్ జోన్ అమలుపై ముందుకు సాగుతోంది. దీంతో కొల్లేరుపై కపట నాటకం ఆపాలంటూ అక్కడి ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు ప్రాంతం ప్రభుత్వాలకు ఒక ఆట వస్తువులా మారింది. ఎన్నికల ముందు హామీలు గుప్పించి ఓట్లు దండుకోవడం, గెలిచిన తర్వాత కొల్లేరు ప్రజలను మోసగించడం పరిపాటిగా మారిపోయింది. వైసిపి ప్రభుత్వం సైతం అదేబాటలో ముందుకు సాగుతుండటంతో అక్కడి ప్రజల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. 77 వేల ఎకరాల్లో కొల్లేరు విస్తరించి ఉంది. దాదాపు 120 గ్రామాల పరిధిలో ఐదు లక్షల జనాభా కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారు. 2006లో కొల్లేరు ఆపరేషన్ తర్వాత అక్కడి ప్రజల బతుకులు చిరిగిన విస్తరిలా మారాయి. అప్పటి నుంచి కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి తమకు న్యాయం చేయాలని అక్కడి ప్రజలు పోరాడుతూనే ఉన్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ టిడిపి ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో తీర్మానం చేశారు. దీనికి ఆ సమయంలో ప్రతిపక్ష పార్టీగా ఉన్న వైసిపి బేషరతుగా అసెంబ్లీలో మద్దతు తెలిపింది. అయితే అదే వైసిపి అధికారంలోకొచ్చాక అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది. వైసిపి అధికారంలోకి వచ్చాక గడిచిన నాలుగున్నరేళ్లలో కొల్లేరు ప్రజల ఉపాధి, ఆ ప్రాంత అభివృద్ధికి సంబంధించి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలను పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతున్న కొల్లేరు ప్రజలను మరింత చిదిమేసేందుకు ఎకో సెన్సిటివ్ జోన్ ముసుగులో ముందుకు సాగుతోంది. ప్రజల ఆకాంక్షలను పక్కన పెట్టి, వాస్తవాలను దాచి పెట్టి ఎకోసెన్సిటివ్ జోన్ అమలుకు ప్రయత్నాలు చేస్తోంది. ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటు చేస్తే మరో 89 గ్రామాలు కొల్లేరు అభయారణ్యం పరిధిలోకి చేరిపోతాయి. అంతేకాకుండా కొల్లేరులో పరిశ్రమల ఏర్పాటు వంటివి పూర్తిగా నిలిచిపోనున్నాయి. అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోనుంది. ఇలాంటి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా మండల కేంద్రాల్లో తూతూమంత్రంగా ఎకోసెన్సిటివ్ జోన్‌పై సమావేశాలు నిర్వహించి మీ నిర్ణయం చెప్పాలని హడావుడి చేశారు. గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండానే చేసినట్లు చెబుతున్నారు. ఈ నెల ఐదో తేదీన కలెక్టరేట్‌లో ఎకోసెన్సిటివ్ జోన్ అమలుపై సమావేశం జరిగింది. కొల్లేరు ప్రాంత ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు పాల్గొన్నారు. ఎకోసెన్సిటివ్ జోన్‌ను కొల్లేరు ప్రాంత ప్రజలతోపాటు ప్రజాప్రతినిధులు సైతం వ్యతిరేకించారు. అయితే తర్వాత కాలంలో ఆ ప్రజాప్రతినిధులను సైతం ప్రభుత్వ పెద్దలు తమ దారిలోకి తెచ్చుకుని వారిని మౌనముద్ర వహించేలా చేశారు. దీంతో ప్రజాప్రతినిధులు పలు ప్రతిపాదనలతో సరిపెట్టారు. ఈ క్రమంలోనే చాపకింద నీరులా ఎకోసెన్సిటివ్ జోన్‌పై జరగాల్సిన పనులను మాత్రం చక్కబెట్టేస్తున్నారు. హెలీకాప్టర్‌తో సర్వే చేయించడం నుంచి అన్ని పనులూ వేగంగా పూర్తి చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ తీరుపై కొల్లేరు ప్రజల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో తామేమిటో చూపిస్తామంటూ కొల్లేరు ప్రజలు హెచ్చరిస్తున్నారు.



భీమవరంలో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నేతలు

హక్కుల పరిరక్షణే అంబేద్కర్‌కు నిజమైన నివాళి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

బకాయిలు చెల్లించాలని యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసన ప్రదర్శనలు

ప్రజాశక్తి - భీమవరం

విజయవాడలో భారీ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని యుటిఎఫ్ స్వాగతిస్తుందని, అయితే ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగ హక్కులను కాపాడినప్పుడే అంబేద్కర్‌కు నిజమైన నివాళి అని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. వైసిపి అధికారం చేపట్టిన తర్వాత రాజ్యాంగానికి తూట్లు పొడిచి, ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ప్రతినెలా క్రమం తప్పకుండా ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని, ఒపిఎస్ అమలు చేయాలని, మున్సిపల్, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడాలని కోరుతూ స్థానిక యుటిఎఫ్ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఉద్యోగ ఉపాధ్యాయులు చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. ప్రకాశం చౌక్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన సాగించి అక్కడ అంబేద్కర్ విగ్రహానికి యుటిఎఫ్ నేతలు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రకాశం చౌక్‌కు చేరుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ బకాయిలు విడుదల చేయని పక్షంలో ఈ నెల 24న జిల్లాస్థాయి నిరసన ప్రదర్శన భీమవరంలో నిర్వహిస్తామన్నారు. 31 నుండి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జిల్లా కేంద్రం భీమవరంలో రిలే నిరాహార దీక్షలు చేస్తామని, బకాయిలు విడుదల అయ్యేవరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు కె.రాజశేఖర్, కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు కెఎస్.రామకృష్ణప్రసాద్, జి.రామకృష్ణంరాజు, డి.ఏసుబాబు, సిహెచ్.కుమార్ బాబ్జి, కెఎస్‌సిహెచ్.సాయిరామ్, రాష్ట్ర కౌన్సిలర్లు జివి.రామానుజరావు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తణుకులో..



పాలకొల్లులో..

పాలకొల్లు: స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి యడ్ల బజార్, పెద్ద గోపురం, గాంధీ బొమ్మల సెంటర్, బస్టాండ్, కోర్టు మీదుగా యుటిఎఫ్ ఆధ్వర్యాన భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కార్యదర్శులు జి.లక్ష్మీనారాయణ, పి.క్రాంతికుమార్, నేతలు దండు పద్మావతి, పిల్లి శ్రీనివాసరావు, ఎస్.జయప్రభ, పిల్లి శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, పంతం రామమూర్తి నాయుడు, కేతా నాగరాజు, జి.ప్రకాశరావు, బి.శైలజ కె.మంజుల అడబాల వెంకటేశ్వరరావు తదితరులు నాయకత్వం వహించారు. సిఐటియు నేత డి.సుధాకర్ సంఘీభావం తెలిపారు.

తణుకురూరల్: బకాయిల విడుదల కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద, ఎన్‌టిఆర్ పార్కు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడారు.

గణతంత్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 26న నిర్వహించబోయే గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లూ చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కలెక్టరేట్‌ను ఆనుకుని ఉన్న పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. డిఇఒ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ, హార్టికల్చర్, మత్స్య, మార్కెటింగ్, డ్వామా, పిఆర్, డిపిఒ, హౌసింగ్, విద్య, డిఆర్‌డిఎ, మెప్మా, ఆర్‌డబ్ల్యుఎస్, ఐసిడిఎస్, హెల్త్ తదితర శాఖలు సమన్వయంతో ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఎఎస్‌పి వి.భీమారావు, భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, కలెక్టరేట్ ఎఒ వైకెవి.అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

మహాకవి వేమన: కలెక్టర్

తెలుగు జాతిని, తెలుగువారి కీర్తిని దశదిశలా తీసుకెళ్లిన మహాకవి యోగి వేమన అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. యోగి వేమన జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి పాల్గొని వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను తన పద్య రూపంలో రచించి ప్రజా కవిగా వేమన గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడుకు వినతి

పాలకొల్లు: తమను రెగ్యులర్ చేసి పనికి తగ్గ వేతనం ఇప్పించాలని సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో జగన్ తమను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు దాటినా తమను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె చేస్తేగాని జీతాలు ఇవ్వడం లేదని వాపోయారు. దీనిపై ఎంఎల్‌ఎ స్పందిస్తూ టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రాగానే ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగుల న్యాయమైన కోరికలు తీరుస్తామని హామీ ఇచ్చారు. వేతనాలు ఇచ్చేటప్పుడు తాత్కాలిక ఉద్యోగులుగా పరిగణిస్తూ, సంక్షేమ పథకాలు అమలు చేసినప్పుడు ఉద్యోగులుగా పరిగణించడం సరికాదన్నారు.

మాటల్లోనే మహిళా సాధికారత.. చేతల్లో శూన్యం

39వ రోజు కొనసాగిన సమ్మె - అంబేద్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అంగన్‌వాడీలు



భీమవరంలో రిలే దీక్షలు చేపట్టిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - ఆచంట

అంగన్వాడీలు అధైర్య పడొద్దని, సిపిఎం జిల్లా కమిటీ పూర్తి మద్దతుగా ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం భరోసా ఇచ్చారు. ఆచంట కచేరీ సెంటర్లో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 39వ రోజు కొనసాగింది. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మాను రద్దు చేయకపోతే ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపిస్తారని తెలిపారు. ఐసిడిఎస్‌ను అత్యవసర సర్వీస్‌గా పరిగణిస్తామని ఎస్మా జిఒ ఇచ్చారని, అలాంటప్పుడు 39 రోజుల నుండి వారి సమస్యలు పరిష్కరించకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎవరూ బెదిరిపోరని, కార్మికులకు సిపిఎం జిల్లా కమిటీ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, వైట్ల ఉషారాణి, మైలే విజయలక్ష్మి, పద్మ, శ్రీదేవి, నాగలక్ష్మి, ఝాన్సీ, సత్యవతి, వెంకటలక్ష్మి, సుజాత, సత్య కుమారి పాల్గొన్నారు.

కాళ్ల : అంబేద్కర్ ఆశయ సాధనకు పనిచేసినప్పుడే ఆయనకు నిజమైన నివాళులర్పించినట్లు అవుతుందని అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు లీడర్ దావులూరి మార్తమ్మ అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఝాన్సీరాణి, సిఐటియు అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం దాసరి వెంకటేశ్వరరావు, ఇర్రింకి ఏడుకొండలు, రాజామణి, కమల, రాణి పాల్గొన్నారు.

పాలకొల్లు : అంగన్వాడీలు ఆందోళనలో భాగంగా 39వ రోజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ మాట్లాడారు. ఆందోళనలో అంగన్వాడీ నేతలు ఎం.శ్రీదేవి, బి.నాగలక్ష్మి, పి.పద్మావతి, జి.ఝాన్సీరాణి, బి.అభిరాణి పాల్గొన్నారు.

పోడూరు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్, సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్, బురాబత్తుల వెంకటరావు, ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, రాయుడు కుమారి, జె.ఉమాదేవి పాల్గొన్నారు.

గణపవరం : సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి మీరైనా చెప్పండి అంటూ అంగన్‌వాడీలు ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబుకు విన్నవించారు. అనంతరం సరిపల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కెవి.మహాలక్ష్మి, సిహెచ్. సీతామహాలక్ష్మి, ఎ.కళ్యాణి, ఎ.లక్ష్మి, డి.ధనలక్ష్మి, డి.పార్వతి పాల్గొన్నారు.



ఆచంట : శిబిరం వద్ద మాట్లాడుతున్న బలరాం

పెంటపాడు : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జె.శ్యామలకుమారి, సిహెచ్.శ్రీదేవి, వి.కనకమహాలక్ష్మి డిమాండ్ చేశారు. 39వ రోజు అంగన్‌వాడీలు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు బంకురు నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్.అనురాధ, జి.జయలక్ష్మి, హేమ, వెంకటలక్ష్మి, శిరీష, మంగతాయారు, పెనగంటి దుర్గ పాల్గొన్నారు.

భీమవరంరూరల్ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ముందుగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వాసుదేవరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. సమ్మెకు యుటిఎఫ్ నాయకులు సంఘీభావం తెలిపారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఆంజనేయులు మద్దతు తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కళ్యాణి, ఝాన్సీ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జి.విజయలక్ష్మి, సీతారత్నం, సిఐటియు మండల కార్యదర్శి ఇ.శ్రీనివాస్, నాగు, ఆదినారాయణ పాల్గొన్నారు.

వీరవాసరం : అంబేద్కర్ స్ఫూర్తితో తమ డిమాండ్లు నెరవేరే వరకూ సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీలు నినదించారు. 39వ రోజు సమ్మెలో భాగంగా అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, నాగరత్నం, ఐ.నిర్మల పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: 39వ రోజు తాలుకాఫీస్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ ప్రాజెక్టు అధ్యక్షురాలు దీన స్వరూపారాణి మాట్లాడారు. అనంతరం తాలుకాఫీస్ సెంటర్ వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు యడవెల్లి వెంకట దుర్గారావు పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : తహశీల్దార్ కార్యాలయం వద్ద 39వ రోజు అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడారు. సమ్మెకు కృష్ణా జిల్లా సిఐటియు నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు, సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాసప్రసాద్, అంగన్‌వాడీ మండల అధ్యక్ష కార్యదర్శులు సరస్వతి, సాయి మహాలక్ష్మి, మౌనిక, కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు. కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బరాజు, కెపిఎస్ జిల్లా అధ్యక్షులు బి.విజయ్‌కుమార్ సంఘీభావం తెలిపారు.

మొగల్తూరు : మొగల్తూరులో అంగన్‌వాడీల దీక్షలు కొనసాగాయి. ఈ మేరకు దీక్షా శిబిరం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సెంటర్లో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమాల్లో పెద్దింట్లు, సారమ్మ, సీత, నాగలక్ష్మి, రేఖ, శాంభవి పాల్గొన్నారు.

యలమంచిలి : అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగింది. ఈ నేపథ్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, కెవిపిఎస్ నాయకులు కె.బాలరాజు, జి.ఏడుకొండల శ్రీనివాస్, అంగన్వాడీ నాయకులు రజినీదేవి పాల్గొన్నారు.

తణుకు రూరల్ : అంబేద్కర్ ఆశయాలు అమలు చేయకుండా, జగన్ విగ్రహం పెడితే సరిపోతుందా అని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విమర్శించారు. స్థానిక కోర్టు వద్ద అంగన్వాడీల సమ్మె 39వ రోజుకు చేరింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్, రిటైర్డ్ ప్రిన్సిపల్ సంకు మనోరమ మాట్లాడారు. కార్యక్రమంలో వసంత కుమారి, కనకదుర్గ, మణి మాలతి, రజని, మంగతయారు పాల్గొన్నారు.



పాలకొల్లులో..


పెనుగొండ : అంగన్‌వాడీల సమ్మె 39వ రోజు కొనసాగింది. ఈ మేరకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అంగన్వాడీ ప్రాజెక్ట్ లీడర్ కె.తులసి, సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, అంగన్వాడీలు నీలవేణి, నాగలక్ష్మి, పరమేశ్వరి పాల్గొన్నారు.

ఆకివీడు : అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ప్రతిష్టించిన ముఖ్యమంత్రి మహిళల సాధికారత గురించి పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ హసీనా అన్నారు. ఈ మేరకు శిబిరంలో అంబేద్కర్ చిత్రపటానికి, సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీలు నివాళులర్పించారు. కార్యక్రమంలో హసీనా పాల్గొని మాట్లాడారు. సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నరసాపురం : అంగన్వాడీల సమ్మె 39వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా పట్టణంలో అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపి శిబిరం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసే నివాళులర్పించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, అంగన్వాడీ నాయకులు జి.విజయలక్ష్మి, జె.సత్యవతి, జి.వెంకటలక్ష్మి, జి.శ్రీలక్ష్మి, ఝాన్సీ లక్ష్మి, సునీత, కృష్ణవేణి, రమణ మేరీ పాల్గొన్నారు.

ఉండి : అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కాదు అంబేద్కర్ ఆశయ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ హసీనా బేగం అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మె 39వ రోజుకు చేరింది. హసీనా బేగం మాట్లాడారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ మండల అధ్యక్ష కార్యదర్శులు చైతన్య, సత్యవేణి, సభ్యులు పాల్గొన్నారు.

పాలకోడేరు : కష్ట నష్టాలను ఓర్చుకుని శాంతియుతంగా తమ సమస్యలపై సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి విమర్శించారు. శిబిరాన్ని వారు సందర్శించి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక చదివి ప్రతిజ్ఞ చేసి వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీలు విజయలక్ష్మి, ధనలక్ష్మి, విమల కుమారి, విమల, నాగమణి పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పివిఎల్

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కాళ్ల

అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో రాష్ట్రం దేశానికి దిక్సూచిగా మారిందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. ప్రాతళ్లమెరకలో సిమెంట్ రోడ్డు పనులకు పివిఎల్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జువ్వలపాలెం - కలవపూడి ఆర్అండ్‌బి రోడ్డులో ప్రాతళ్లమెరక గ్రామం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు సిఎంఎ నిధులు రూ.40 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఉండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శ్రమించడం లేకుండా కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుణ్ణం శిరీష, విశ్వనాధరాజు, వైసిపి ప్రాతళ్లమెరక గ్రామ అధ్యక్షులు వేగేశ్న బాల గణపతి వర్మ, నేతలు నాయకులు సాగిరాజు హరివర్మ, కంతేటి సుబ్బారాజు, దంతులూరి కోటేశ్వరరాజు పాల్గొన్నారు.


ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

పిప్పరలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని పిప్పర వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాలను శుక్రవారం తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి జి.బాలకృష్ణ తెలిపారు. ఆర్అండ్‌బి రోడ్డును ఆక్రమించి కొంత మంది షాపులు పెట్టుకుని నడుపుతున్నారని తెలిపారు. అయితే పంచాయతీ ఆస్తులు ఆక్రమణలు గుర్తించామని గ్రామానికి చెందిన పలువురు కోర్టులో పిటిషన్ వేయడంతో గేటెడ్ ఆర్డర్లలో షాపులు తొలగించాలని హైకోర్టు నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. అయితే షాపులు తొలగించుకునేందుకు ప్రయత్నిస్తుంటే షాపు యజమానులు జనవరి ఎనిమిది తేదీ వరకూ అవకాశం ఇవ్వాలని కోరారని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం షాపు యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిప్పా లక్ష్మి, విఆర్ఒలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు పోరాటం అభినందనీయం

ప్రజాశక్తి - యలమంచిలి

సమాజంలో ఇప్పటికీ కొన్ని చోట్ల కొనసాగుతున్న కుల వివక్ష నిర్మూలన కోసం కెవిపిఎస్ అనేక ఏళ్లుగా పనిచేయడం అభినందనీయమని తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024వ సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు.. ఘోరాలు..

దమ్ము ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరవాసరం


మృతుడు శివశంకర్

చేలో దుక్కు దున్నుతుండగా తాను నడుపుతున్న దమ్ము ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ కొల్లా శివశంకర్ మృతి చెందాడు. ఈ సంఘటన మెంటేపూడిలో శుక్రవారం చోటుచేసుకుంది. దీంతో గ్రామంలో తీవ్రవిషాదం నెలకొంది. శివశంకర్ కష్టపడి పనిచేసే వ్యక్తి. వ్యవసాయం చేసుకుంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం దుక్కుదున్నుతుండగా ట్రాక్టర్ చక్రాలు బురదలో కూరుకుపోయాయి. బయటకు తీసే క్రమంలో ట్రాక్టర్ తిరగబడి శివశంకర్ మృతి చెందాడని రైతులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలో పని చేస్తున్న కూలీలు, రైతులు మరో ట్రాక్టర్‌తో తిరగబడ్డ ట్రాక్టర్‌ను పైకి లేపి మట్టిలో కూరుకుపోయిన శివశంకర్‌ను బయటకు తీశారు. కొనఊపిరితో అతనిని హుటాహుటీన వీరవాసరం పిహెచ్‌సికి తరలించినా అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య మరలా గర్భవతి. గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండే శివశంకర్ ఈ విధంగా మృతి చెందడంతో గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

జెసిబి డ్రైవర్‌పై పెట్రోల్ వేసి..

తీవ్ర గాయాలపాలైన జయరాం - నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బ్యాంకు వేలంలో స్వాధీనం చేసుకున్న స్థలాన్ని చదును చేస్తుండగా స్థలం కోల్పోయిన వ్యక్తి జెసిబి డ్రైవర్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేశ్వరరావు అనే వ్యక్తి స్థానిక సుంకర భద్రయ్య వీధిలో ఉన్న స్థలంపై ఓ బ్యాంకులో అప్పు తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు వారు వేలం ద్వారా జయరాం అనే వ్యక్తికి స్థలాన్ని అప్పగించారు. అయితే జయరాం గురువారం రాత్రి జెసిబితో స్థలాన్ని చదును చేస్తుండగా వెంకటేశ్వరరావు బకెట్‌తో పెట్రోల్ తెచ్చి జెసిబిపై, డ్రైవర్‌పై పోసి నిప్పటించాడు. దీంతో డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు గాయాలపాలైన డ్రైవర్‌ను స్థానిక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. స్థానిక సమాచారంతో విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుడు వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. అయితే శుక్రవారం ఉదయం ఈ ఘటన పట్టణంలో కలకలం సృష్టించింది.


గాయపడిన జయరాం

హత్యాయత్నం కేసులో అర్చకునికి రిమాండ్

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల ఉప్పులూరు గ్రామంలో యువతిపై హత్యాయత్నానికి పాల్పడిన ఆలయ అర్చకులు కొణతం సుబ్బయ్య దాసును ఉండి పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి భీమవరం కోర్టులో హాజరు పర్చారు. కోర్టు సుబ్బయ్య దాసుకు రిమాండ్ విధించినట్లు ఉండి ఇన్‌ఛార్జి ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు చేసిన ఇన్‌ఛార్జి ఎస్ఐ వీరభద్రరావు, ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణను ఆకివీడు సిఐ కెవివిఎన్ సత్యనారాయణ అభినందించారు.

లక్ష్యాలను బాధ్యతతో పూర్తి చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు బాధ్యతతో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో రీసర్వే స్టోన్ ప్లాంటేషన్, సమిత్వ, ధాన్యం కొనుగోలు, సివిల్ సప్లై, సర్వే - యఫ్ లైన్, సబ్ డివిజన్ తదితర అంశాలపై జిల్లా అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఆచంట, పాలకొల్లు, పెనుమంట్ర, పోడూరు, యలమంచిలి మండలాల రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. రీసర్వే జరుగుతున్న గ్రామాలు ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సివిల్ సప్లై గోడౌన్స్ క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని, రిజిస్టర్ల ప్రకారం స్టాకును పరిశీలించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులు రాజు, కె.చెన్నయ్య, జిల్లా పంచాయతీ అధికారి జివికె మల్లికార్జునరావు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి


అభివాదం చేస్తున్న బిసి ప్రజా సంక్షేమ సంఘం నేతలు

బిసి గణన వేగవంతం చేయాలి

బిసి ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

రాష్ట్రంలో బిసిల కుల, జన గణనను వేగవంతం చేయాలని ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పెన్నాడలో బిసి ప్రజా సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల అధ్యక్షులు దొమ్మేటి వేణుగోపాలం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బిసి కుల, జన గణనను చేయడం ఆలస్యం అవుతుందన్నారు. దీనివల్ల 60 శాతంపైనున్న బిసిలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రిజర్వేషన్లు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బిసిలకు అత్యధిక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం జాతీయ నాయకులుగా ఉన్న వెంకటేశ్వరరావుకు తగిన గుర్తింపు, న్యాయం చేయలేదని పార్టీ మారాలని బిసి నేతలు కోరారు. దీనిపై స్పందించిన వెంకటేశ్వరరావు ఈ నెలాఖరు వరకూ తనకు సమయం ఇవ్వాలని నేతలను కోరారు. ఈ సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షులు చింతాడ శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిప్పాడ చంద్రశేఖరరావు, జిల్లా అధ్యక్షులు కుక్కల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కండుబోయిన సుబ్రహ్మణ్యం, జిల్లా గౌరవ అధ్యక్షులు దొంగ కృష్ణ, నాయకులు మల్లాడి వెంకటేశ్వరరావు, మహేందర్, శ్రీనివాసరావు, రాయుడు పాల్గొన్నారు.

21న కోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 21న తాడేపల్లిగూడెం అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి పురుషోత్తంకుమార్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్యకిరణ్‌శ్రీ, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అన్నామణి, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అరుంధతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పిరెడ్డి, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

టిడిపితోనే రామరాజ్యం

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపితోనే రాష్ట్రానికి రామరాజ్యం వస్తుందని పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు రత్నంరాజు అన్నారు. శుక్రవారం మొగల్తూరు పంచాయతీ పడమటపాలెంలో బాబు షూటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలిదిండి కుమార్ బాబు, బొల్ల చంటి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం సురక్షితం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, అంతేకాకుండా ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు ప్రతి పదిహేను రోజులకు అందిస్తోందని తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సూర్యనారాయణమూర్తి తెలిపారు. జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం - భీమవరం రూట్లలో ఈ నెల 1వ తేదీ నుండి 16వ తేదీ వరకూ ప్రయాణం చేసిన వారి టికెట్లు శుక్రవారం ఉదయం 11:00 గంటలకు తాడేపల్లిగూడెం బస్ స్టేషన్ లో ప్రయాణీకుల సమక్షంలో లక్కీ డీప్ నిర్వహించారు. విజేతలకు తాడేపల్లిగూడెం జివి మాల్ షాప్ అండ్ సెలబ్రేట్ వారి ఆర్థిక సౌజన్యంతో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, సూపర్‌వైజర్ విజయకుమార్, ప్రయాణికులు పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు


అమ్మవారిని దర్శించుకుంటున్న అన్నదాన కమిటీ సభ్యులు

మొగల్తూరు గ్రామ దేవత నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. జాతర ముగింపు సందర్భంగా అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సమాధానం అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అన్న సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్నదాన కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు ఓట్ల కోసమేనా

అంబేద్కర్ సాహితీ వేదిక రాష్ట్ర కార్యదర్శి ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి - యలమంచిలి

ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అంబేద్కర్ విగ్రహం పెట్టినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, అయితే విగ్రహం ఏర్పాటు ఓట్ల కోసమా అని అంబేద్కర్ సాహితి వేదిక రాష్ట్ర కార్యదర్శి, జనసేన జిల్లా నాయకుడు ఉన్నమట్ల ప్రేమ్ కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక తీసేసిన 27 దళిత సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తారా అని ప్రశ్నించారు. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎంఎల్‌సిని ఇప్పుడైనా సస్పెండ్ చేసి వెంట తిప్పుకోవడం మానేస్తారా అన్నారు. కనీసం మీ జెండా పట్టుకుని తిరిగిన దళితులకైనా ఎస్‌సి కార్పొరేషన్ లోన్లు ఇస్తారా? సబ్సిడీ లోన్లు మాట ఎత్తుతారా అని ప్రశ్నించారు.

నేడు పాలకొల్లులో ఆక్వా రైతుల భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - పాలకొల్లు

భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం వారి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ శనివారం ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాలకొల్లులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ చెప్పారు. ఈ ర్యాలీ పూలపల్లి బైపాస్ రోడ్డులోని తమ ఆఫీస్ నుంచి తహశీల్దార్, ఫిషరీస్ కార్యాలయం వరకూ నిర్వహించి వారికి వినతి పత్రం సమర్పిస్తామని చెప్పారు. ఆక్వా రైతులు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ధాన్యం మాదిరిగా ఆక్వాకు కనీస మద్దతు ధర ఉండాలని రైతులు డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. హేచరీస్ మీద ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని, ప్రోసెసింగ్ ప్లాంట్లను నియంత్రించాలని రైతులు డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఫీడ్ ప్లాంట్లు రేట్లు తగ్గించాలని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా రైతులకు రావాల్సిన సబ్సిడీ, ఇతర హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

పండుగ రోజుల్లో యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర అగ్నికుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు అన్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14 నుండి 19వ తేదీ వరకూ వేములదీవి-పడమర గ్రామంలో జరిగిన పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆనందాన్ని, పోటీతత్వాన్ని, దేహ దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. నరసాపురం మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు ఉంగరాల రమేష్ నాయుడు మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం అలవర్చుకోవాలన్నారు. మాజీ సర్పంచి అడ్డాల శ్రీనివాసరావు మాట్లాడారు. కబడ్డీలో మొగల్తూరు, రుస్తుంబాద, పెదమైనవానిలంక జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వాలీబాల్‌లో వేములదీవి, ఎల్‌బి చర్ల, సర్దుకొడప జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందాయి. ముగ్గులు, స్లోసైక్లింగ్, మ్యూజికల్ ఛైర్స్, డ్యాన్స్, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు కొండేటి శ్రీనివాస్, మైల వసంతరావు, సువర్ణభూమి డైరెక్టర్స్ ఉలిశెట్టి శ్రీనివాస్, ఉంగరాల శంకర్ పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న సభ్యులు

తక్కువ ఖర్చుతో కేన్సర్ నిర్ధారణ పరీక్ష

ప్రజాశక్తి - తణుకురూరల్

కేన్సర్ రోగికి తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా కేన్సర్ నిర్ధారణ పరీక్ష సులభతరం చేసుకోవచ్చని డైరెక్టర్, హోమీ బాబా కేన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ సెంటర్, వైజాగ్ డాక్టర్ ఉమేష్ మహంత్‌శెట్టి అన్నారు. శుక్రవారం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో స్ట్రెంథెనింగ్ కేన్సర్ కేర్ డెలివరీ ఇన్ ఆంధ్రప్రదేశ్ త్రూ టెక్నాలజీ సోల్యూషన్స్ విభాగాన్ని జిల్లా డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమేష్ మహంత్‌శెట్టి మాట్లాడుతూ కేన్సర్ నిర్ధారణ కోసం ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా కొన్ని రోజుల తరువాత ఏమీ జరుగుతుందో అని ఒక అంచనా వేయొచ్చన్నారు. ఈ అవకాశం లేకపోతే రోగి ముందుగా హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు వెళ్లి పరీక్షలు చేయించుకుంటారని, ఈలోగా రోగి మానసికంగా, ఆర్థికంగా కుంగిపోతారని తెలిపారు. 10 సంవత్సరాలుగా తాడేపల్లి కేంద్రంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం నేషనల్ కేన్సర్ గ్రిడ్ ద్వారా నడపబడుతుందన్నారు. ఈ సెంటర్ విజయవంతంగా నిర్వహించబడితే రాష్ట్రం అంతటా విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రేడియో థెరపిస్ట్, హెచ్‌ఒడి, డిపార్టుమెంట్ ఆఫ్ రేడియేషన్ అంకాలజీ, జిజిహెచ్ కాకినాడ డాక్టర్ శ్రీనివాసన్, స్టేట్ నోడల్ ఆఫీసర్ ఫర్ కాంప్రెహెన్సివ్ కేన్సర్ కేర్ డాక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.


త్రూ టెక్నాలజీ సోల్యూషన్స్ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఉమేష్ మహంత్‌శెట్టి

22న ఓటర్ల తుది జాబితా ప్రకటన


ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 22 ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ నేపథ్యంలో క్లైమ్‌లను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి శుక్రవారం ప్రత్యేక ఓటరు సవరణ, ఇతర సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుండి కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్ఒలు, ఇఆర్ఒలు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. 22న తుది ఓటర్ల జాబితా ప్రకటన అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు తుది ఓటర్ల జాబితాలోని అన్ని అంశాలను కూలంకుశంగా తెలియజేయాలన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - భీమవరం

విజయవాడలో అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం బహుమతి ప్రదానం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈనెల 9 నుంచి 18వ తేదీ వరకూ జన్ భగీధారి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, కలెక్టరేట్ ఎఒ వైకెవి.అప్పారావు, డిఇఒ ఆర్.వెంకటరమణ, గ్రామ వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కులగణన సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో కులగణన సర్వే శుక్రవారం ప్రారంభమైనట్లు తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, ఎంపిడిఒ డి.సుహాసిని తెలిపారు. పోడూరులో జరుగుతున్న కులగణన సర్వేను తహశీల్దార్ పరిశీలించి సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు తగు సూచనలు ఇచ్చారు. కులగణన సర్వే అత్యంత పారదర్శకంగా చేయాలన్నారు. ప్రజలంతా ఈ సర్వేకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిటి టి.రాజేష్, ఆర్ఐ కె.రాంబాబు, విఆర్ఒ ఎస్.కుమార్ పాల్గొన్నారు.

ఉచిత నర్సింగ్ శిక్షణను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

ఉచిత నర్సింగ్ శిక్షణను ఉపయోగించుకోవాలని చాగంటి ఉమా నాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ చాగంటి చిన్నా అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నరసాపురం నియోజకవర్గ పరిసర ప్రాంతంలో పది, ఇంటర్, డిగ్రీ చదువుకున్న మహిళలకు ఉపాధి అవకాశం కల్పించే ఉద్దేశంతో ఉచితంగా నర్స్ ట్రెయినింగ్ ఒఎన్‌జిసి సహకారంతో చాగంటి ఉమా నాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ చిన్న ఆధ్వర్యంలో నేర్పించారు. ట్రెయినింగ్ అనంతరం ఉపాధి అవకాశం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 8919307930, 89774 88970 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

విజయవాడకు తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - వీరవాసరం

సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న నేపథ్యంలో మండలం నుంచి వైసిపి శ్రేణులు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా నిర్వహించే సభకు రాయకుదురు నుండి వైసిపి మండల కన్వీనర్ కడలి ధర్మారావు, సర్పంచి గెద్దం భారతీ భాస్కరావు నేతృత్వంలో బృందానికి సర్పంచి జెండా ఊపి ప్రారంభించారు.

పోడూరు : విజయవాడలో అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణకు మండలం నుంచి వైసిపి దళిత నేతలు తరలివెళ్లారు.

మొగల్తూరు : మండలం నుండి వైసిపి నాయకులు, అభిమానులు శుక్రవారం విజయవాడకు ప్రత్యేక వాహనాలలో అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు

నరసాపురం: విజయవాడలో జరిగే అంబేద్కర్ విగ్రహావిష్కరణకు నర్సాపురం నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. పట్టణంలో అంబేద్కర్ చిత్రపటానికి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు పాలాభిషేకం చేశారు.

భీమవరం : కొట్లాది మంది భారతీయుల ఆరాధ్య దైవం అంబేద్కర్ అని ప్రముఖ విద్యావేత్త మేడిది జాన్సన్ అన్నారు. స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్లో ఎపిఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.వీరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రాజబాబు, కోశాధికారి ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం

రబీ సాగులో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైగాల శ్రీనివాసరావు అధికారులను కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో 4.17 లక్షలు మెట్రిక్ టన్నులు ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయడంపై రైతులు సంతోషంగా ఉన్నారని, వారి తరుపున కలెక్టర్ పి.ప్రశాంతికి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో సాగునీటికి ఎటువంటి ఇబ్బందీ తలెత్తకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు సకాలంలో నగదు జమ చేశారని, అయితే కొంత మంది రైతులకు బకాయిలు ఉన్నాయని, అవీ వచ్చేలా చూడాలని కోరారు. గోకులం షెడ్ల పెండింగు బకాయిలు ఇప్పించాలని కోరారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, నీటిపారుదల శాఖ ఇఇ ఎం.దక్షిణామూర్తి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కొట్టి కుటుంబరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, కెఎస్ఎస్.శ్రీనివాసరావు, అనిల్ కుమారి, ఎ.పార్వతి, ఉండి కెవికె కోఆర్డినేటర్ ఎం.మల్లికార్జునరావు పాల్గొన్నారు.